క్లుప్తంగా

గ్రీవెన్స్ సెల్ నిర్వహించండి

గంగాధరనెల్లూరు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి ఆన్‌లైన్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక పంపాలని పేర్కొన్నారు.

జింకను కాపాడిన స్థానికులు


జనావాసంలోకి వచ్చిన జింక

శ్రీరంగరాజపురం: పాడుబడిన బావిలో పడిన జింకను గ్రామస్తులు కాపాడిన సంఘటన వెలుగు చూసింది. మండలంలోని పద్మాపురం గ్రామంలో ఉన్న ఓ పాడుబడిన బావిలోకి పుల్లూరు అటవీప్రాంతం నుంచి వచ్చిన జింక దారి తెలియక శనివారం రాత్రి అదుపుతప్పి పడిపోయింది. ఆదివారం ఉదయం జింక బావిలో పడిన విషయాన్ని గుర్తించిన స్థానికులు దారం సాయంతో జింకను సురక్షితంగా రక్షించారు. సమాచారం అందుకున్న కార్వేటినగరం అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని జింకను స్వాధీనం చేసుకున్నారు. జింకను కాపాడిన స్థానికులను అధికారులు అభినందించారు. అనంతరం జింకకు ప్రథమ చికిత్స చేసి కార్వేటినగరం కుమ్మయ్యగుంట అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

జైన్ ఫ్యాక్టరీలో అధికారుల తనిఖీలు


జైన్ ఫ్యాక్టరీ పరిసరాలను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

గంగాధరనెల్లూరు: మండలానికి సమీపంలో ఉన్న జైన్–2 ఫ్యాక్టరీని ఆదివారం విద్యుత్ అధికారులు పరిశీలించారు. ఇటీవల జైన్ ఫ్యాక్టరీలో పనిచేసే ఇళయరాజా అనే కార్మికుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. దీనిపై ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ రాజా ఫ్యాక్టరీలోని పరిస్థితులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఈఈ పద్మనాభపిళ్లై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదేశాల మేరకు ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఫ్యాక్టరీలో అంతర్గత విద్యుత్ బోర్డులోని లోటుపాట్ల వల్ల కార్మికుడు విద్యుత్ షాక్ తగిలి చనిపోవడం జరిగిందన్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

వినాయకుని సేవలో కలెక్టర్


కలెక్టర్, కుటుంబసభ్యులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కలెక్టర్ వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబసమేతంగా కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

రూ. లక్ష విరాళం


చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న సుజిని

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన గోశాలను విజయవాడ వాస్తవ్యులు జి.సుజిని ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు చెక్కు అందించారు. గోసంరక్షణకు విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని దాత పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం కేసులో మహిళ అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం కేసులో ఓ వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంగారుపాళ్యం మండలంలో కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో చిల్లగుండ్లపల్లికి చెందిన ధనలక్ష్మి (46) అనే మహిళ నుంచి కర్ణాటక మద్యం పట్టుబడింది. 13 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, వెంకటేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాడికి వడదెబ్బ

- పాడి పశువుల్లో పాల దిగుబడిపై ప్రభావం
- మృత్యువాత పడే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- ఆర్బీకేల్లో పాడిరైతులకు అవగాహన సదస్సులు


పశువులకు వైద్యచికిత్స అందిస్తున్న వైద్యులు

పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు పశుపోషకులే గుర్తించి ప్రథమ చికిత్స అందించాలి. ముఖ్యంగా వేసవిలో పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశం అధికంగా ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పశువులు వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా పాడినే నమ్ముకుని జీవించే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం మూగ జీవాల రక్షణకు కూడా ప్రత్యేక చొరవ చూపుతోంది.

నియోజకవర్గంలో పశువుల వివరాలు ఇలా

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
నగరి	12200	1500	10000	15000
పుత్తూరు	9700	1200	8000	12000
విజయపురం	4200	700	3000	6000
నిండ్ర	3700	600	2700	4500
వడమాలపేట	2400	300	2000	3000

నగరి: వేసవిలో పశువుల రక్షణ చాలా ముఖ్యం. పశుపోషకులు నిత్యం పశువుల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తుండాలి. ముఖ్యంగా వడదెబ్బ సోకే అవకాశం ఉన్నందున పర్యవేక్షిస్తుండాలి. రాష్ట్రప్రభుత్వం కూడా పశు సంరక్షణకు ప్రత్యేక అవసరమైన చర్యలు చేపడుతోంది. పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు చంద్రశేఖర్ గౌడ్, నగరి వెటర్నరీ ఏడీ వాసు, మండల పశువైద్యాధికారులు నగరి, ఛీరకుప్పం, ముడిపల్లి ఆర్బీకేల్లో పాడిరైతులతో సమావేశమై వారికి తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. వారు తెలిపిన వివరాల మేరకు ఎండప్రభావం పశువులపై ఇలా ఉంటుంది.

శరీర ప్రక్రియ మందగిస్తుంది..

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ శ్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సరిగా పని చేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.


నగరి ఆర్బీకేలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ వాసు

జాగ్రత్తలు తప్పనిసరి..



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలివీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లని నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే పశు వైద్యాధికారులను సంప్రదించాలి. అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్‌చేయాలి. ఇంటి ముంగిటే పశువైద్యం అందుతుంది. వైద్యులు వేడిని తగ్గించే ఇంజెక్షన్లు వేస్తారు. అప్పుడే పశువులు నీరసం నుంచి బయటపడతాయి.

– వాసు, పశుసంవర్ధక శాఖ ఏడీ, నగరి

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడ కోసం చెట్టు కింద చేరి కూలబడుతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బ వల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసార వ్యాధి వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు..

వేసవిలో ఎండలోకి పశువులను వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయటకు వదలాలి. పశువులను రోజుకు మూడు, నాలుగుసార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటిపై తరచుగా చల్లటి నీటిని చల్లుతుండాలి. గాలి బాగా ప్రసవించేటట్లు ఎత్తైన పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పులు ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి మధ్యాహ్న వేళల్లో నీళ్లు చల్లుతూ ఉండాలి. వడగాల్పుల ప్రభావం పడకుండా గోనె సంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.

నేడు పోషకాహార ప్రదర్శన

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏపీఎం కవిత ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు పంచాయతీ రాజ్ దినోత్సవం

వెదురుకుప్పం: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 10.30 గంటలకు వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు.

5 శాతం రాయితీకి అవకాశం

నగరి: ఈ ఏడాది పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ వస్తుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పన్ను రాయితీ పొందాలన్నారు. వార్డు సచివాలయాల్లో గానీ, మున్సిపల్ కార్యాలయంలో గానీ, పురసేవా యాప్ ద్వారా గానీ, సీడీఎంఏ.ఏపీ.జీవోవిటీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా గానీ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించవచ్చన్నారు.

గాలివాన బీభత్సం


నేలకూలిన విద్యుత్ స్తంభం


మొరవలో ధ్వంసమైన ఇల్లు

వెదురుకుప్పం: మండలంలో ఆదివారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి అనుకోని నష్టాలను ప్రజలు చవిచూడాల్సి వచ్చింది. ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలాయి. తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలో వెంకటాద్రి, సుందరమ్మ చెందిన రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. గాలికి పైకప్పులు ధ్వంసమవడంతో ఇంట్లో ఉన్న వస్తువులు తడిసిపోయాయని బాధితులు రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. అదేవిధంగా సుందరాంగిణిపల్లె సమీపంలో ఉన్న 220 కేవీ విద్యుత్ స్తంభం నేలకూలింది. విద్యుత్ వైర్లు గ్రామంలోని ఇళ్లపై పడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలిసినా విద్యుత్ శాఖ అధికారులు స్పందికపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. పచ్చికాపల్లం ప్రాంతంలో వరి పైరు నేలకొరిగింది.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. మండల పరిధిలోని తడుకు, పైడిపల్లి, తొరూరు, గోపాలకృష్ణాపురం, కేబీఆర్‌పురం తదితర గ్రామాల్లోనూ భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కేబీఆర్‌పురంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షంతో మరోనెల రోజుల పాటు మామిడి తోటలకు నీరు కట్టే పని లేకుండా పోయిందని రైతులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలతో వేసవితాపంతో ఉన్న ప్రజలకు వర్షం కారణంగా ఉపశమనం కలిగింది.


పైడిపల్లిలో రాలిన మామిడి కాయలు

వేడుకగా శ్రీవారి కల్యాణం

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం వేడుకగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అభిషేకాది పూజల అనంతరం వివిధ రకాల పూలు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి, భూదేవి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా మేళతాళాలతో శ్రీవారి కల్యాణ మండపానికి తీసుకొచ్చి ఆశీనులను చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తుల ఎదుట హోమం నిర్వహించారు. ఆలయ అర్చకుల బృందం శ్రీదేవి, భూదేవి మెడలో మాంగళ్యధారణ చేశారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కాసరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునిరత్నం నాయుడు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రధాన పంటకు ముందుగానే కనీసం 18 రకాల నవ ధాన్యాలను భూమిలో చల్లుకుని వేపుగా పెరిగిన తరువాత భూమిని కలియదున్నుకోడం వల్ల భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయన ఎరువు లు వాడకం తగ్గించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పురుగులు, తెగుళ్లను తక్కువఖర్చుతో సులభంగా నివారించుకోవచ్చని తెలిపారు. కాసరం సర్పంచ్ మునెమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రామకృష్ణయ్య, తిరుపాల్, భ్రమరాంబ, రంగయ్య, శాంతి, ధనమ్మ పాల్గొన్నారు.

ఘనంగా అర్జున తపస్మాన్


తపస్సు మాను పైనుంచి పడే పూలు, నిమ్మకాయల కోసం పోటీ పడుతున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల గ్రామంలో వెలసిన ద్రౌపదీదేవి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ ఆదివారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా జరుపుకున్నారు. వేణుగోపాల నాట్యమండలి అర్జున వేషధారి శ్రీరంగరాజుపురం మండలం మెదవాడ గ్రామం భాస్కర్ తపస్మాన్ చెట్టులోని మెట్టుమెట్టుకు పరమ శివున్ని వేడుకుంటూ పద్యాలు ఆలపిస్తూ తపస్సు మానును అధిరోహించాడు. సంతాన లేమితో బాధపడుతున్న పలువురు మహిళలు తపస్సు మాను వద్ద వర పడి సంతానం కలగాలని వేడుకున్నారు. అర్జునుడు తపస్సు మాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, విబూదిపండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఏడాది తమిళనాడు, కర్ణాటక ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో శ్రీకృష్ణ, ద్రౌపది ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి.


తపస్సు మాను ఎక్కుతున్న అర్జున వేషధారి

వైభవంగా గురు సంక్రమణ పూజలు




గురు సంక్రమణ పూజల్లో భక్తులు, సత్రవాడ ఈశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో దక్షిణామూర్తి

నగరి: దక్షిణామూర్తి ఆలయాల్లో ఆదివారం గురు సంక్రమణ పూజలు వైభవంగా జరిగాయి. గురుభగవానుడు మీనరాశి నుంచి మేషరాశిలోకి ప్రవేశించిన సందర్భంగా పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు మూలస్థాన శ్రీమేతా దక్షిణామూర్తి స్వాముల వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మండపం వద్ద ఉత్సవ దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరించారు. మేషం, కుంభం, మకరం, వృశ్చికం, కన్య, కర్కాటకం, వృషభ రాశుల వారు పరిహారం చేసుకోగా మీనం, ధనస్సు, తులా, సింహం, మిథున రాశులవారు పూజల్లో పాల్గొని గురుభగవానున్ని దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్రవాడ ఈశ్వరాలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలో ప్రత్యేక అభిషేక, అర్చనలు చేసి స్వామివారిని సుందరంగా అలంకరించగా భక్తులు దర్శించుకుని పరిహార పూజలు చేసుకున్నారు.

మేమంతా నారాయణస్వామి వెంటే..




మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, శేఖర్‌యాదవ్, నాయకులు, విలేకరులతో మాట్లాడుతున్న మహిళలు

- ఎల్లో మీడియాలో ఊహాజనిత వార్తలు రాయడం సరికాదు
- మా పార్టీ నాయకులను, కార్యకర్తలను తప్పుదారి పట్టిస్తారా !
- వచ్చే ఎన్నికల్లో నారాయణస్వామి హ్యాట్రిక్ గెలుపు ఖాయం
- ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఫైర్

పాలసముద్రం: నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి వెంటే మా పయనమని జెడ్పీటీసీ అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్ తెలిపారు. ఆదివారం వారు స్థానిక నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా జీడీనెల్లూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిపై కక్ష పూరితంగా ఎల్లోమీడియాలో కథనాలు రాయడం దుర్మార్గమన్నారు. డిప్యూటీ సీఎంకు సొంత బంధువు, వ్యక్తిగత కార్యదర్శిగా గతంలో పని చేసిన ఓ వ్యక్తి నియోజకవర్గంలో నాయకులను పలకరించిన పాపానికి, అతను ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నాడని, అందుకు తాము కూడా సహకరిస్తున్నట్లు ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రతి విషయాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఆపాదించి బురద చల్లాలని చూడడం మంచిది కాదన్నారు. తాము ఎప్పటికీ ఉప ముఖ్యమంత్రి వెంటే నడుస్తాం అని తేల్చి చెప్పారు. సుబ్రమణ్యం, రమేష్ అనే వ్యక్తులు ఏ దురుద్దేశంతో వచ్చారో తమకు తెలియదని, మండలంలో తాము 'జగనన్నే మా నమ్మకం' కార్యక్రమం నిర్వహిస్తుండగా, అక్కడికి వచ్చి ఫొటోలు దిగారన్నారు. ఆ ఫొటోలను పెట్టి మా పార్టీ నేతపై తప్పుడు కథనాలు రాయడం సరి కాదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసీయాదవ్, మాజీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్‌బాబు, ఎంపీటీసీ గోవిందరాజు, నాయకులు మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, నాయకులు సుందర్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, వేణు, అరుల్, మురళి, గోపి, రవిరెడ్డి, షణ్ముగ రెడ్డి, చంద్రకుమార్ పలువురు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు

శ్రీరంగరాజపురం: ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిట్టిబాబు నాయుడు అసత్య ఆరోపణలు చేయడం తగదని మండలంలో మంగుంట గ్రామానికి చెందిన మహిళలు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీకి అమ్ముడుపోయిన కొత్తపల్లి శంకర్ దళిత చైతన్యయాత్ర పేరిట గ్రామాల్లో పర్యటించి ఉద్దేశపూర్వకంగా మహిళలతో ఫొటోలు దిగి డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ దళితుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. దళిత నియోజకవర్గంలో దళితులను టీడీపీ ఇన్‌చార్జ్‌ను పెట్టలేని చంద్రబాబు, ఇక్కడ కూడా తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు సుభాషిణి, మునికృష్ణ, యువరాజ్, గౌరమ్మ, విమలమ్మ, శ్రీదేవి, చెంగమ్మ, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా 2024లో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని, ఆయన గెలుపును ఆపే శక్తి ఎవరికీ లేదని వైస్ ఎంపీపీ జెగిని విజయ స్పష్టం చేశారు. ఆదివారం ఆమె వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కొనియాడారు.

వారికి పుట్టగతులు ఉండవు..

మచ్చలేని నాయకుడిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని కొందరు దురుద్దేశంతో ఎల్లో మీడియా ద్వారా అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అలాంటి నమ్మకద్రోహులకు పుట్టగతులు ఉండవన్నారు. ఇకనైనా నారాయణ స్వామిపై బురద చల్లడం మానుకోవాలన్నారు.

'మీలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యం'


కేబీఆర్‌పురంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు

పుత్తూరు రూరల్: రాష్ట్రంలో సారా అనేది లేకుండా చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని, ఇందుకు అనుగుణంగా మీలో 'పరివర్తన' తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని పుత్తూరు సెబ్ సీఐ ఎస్.కృష్ణ స్పష్టం చేశారు. పరివర్తన 2.0 కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని తిరువట్యం, ఎరికంబట్టు, జీఎన్ కండ్రిగ, వెంకటకృష్ణాపాలెం, కేబీఆర్‌పురం, తిరుమలకుప్పం గంగమాంబాపురం గ్రామాల్లో సీఐ కృష్ణ, ఎస్ఐ నాగరాజుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకం వల్ల తప్పుడు పనుల కారణంగా కుటుంబాలు నాశనమవుతాయని వివరించారు. సమాజంలో నేరస్తులుగా కాకుండా తలెత్తుకుని బతికేలా మహిళలు తమవారికి తెలియజెప్పాలని సూచించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి నేటి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అనేక రూపాల్లో రుణాలను అందిస్తోందిని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాత నేరస్తులకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం సారా తయారీ, రవాణా పూర్తిగా అరికట్టబడిందని, అయితే తిరిగి అలాంటి పనులకు పూనుకుంటే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.


తిరుమలకుప్పం గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు